ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5




చిత్తూరు

జిల్లా వార్తలు

మంగళవారం 30 జూలై 2024

ఇక రాజముద్రతో.. రైతులకు పాసుపుస్తకాలు

- నమూనా పుస్తకాన్ని విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- జిల్లాలో జగన్ ఫొటోతో ఉన్న 90,287 పుస్తకాల ఉపసంహరణకు కసరత్తు



నమూనా పాసుపుస్తకాన్ని చూపిస్తున్న సీఎం చంద్రబాబు

చిత్తూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జగన్ ఫొటో పిచ్చి పరాకాష్టకు చేరింది. జనన, మరణ ధ్రువపత్రాలనూ వదల్లేదు. చివరకు రీ సర్వే చేశాక పొలాల సరిహద్దులు చూపుతూ నాటే రాళ్లకూ బొమ్మలేశారు. రైతులకు ఇచ్చే పట్టాదారు పాసు పుస్తకాలమీద జగన్ ఫొటోలే. తమ భూములకు జగన్ ఫొటో ఏంటంటూ రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో తాను గెలిస్తే జగన్ ఫొటోలున్న పాసుపుస్తకాలను రద్దు చేసి రాజముద్రతో కొత్తవి ఇస్తానని చంద్రబాబు చెప్పారు. అనుకున్నట్టే.. రాజముద్రతో నమూనా పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు.


'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష' కార్యక్రమానికి జిల్లాలోని గుడిపాల మండలం ముత్తుకూరుపల్లెను తొలి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రారంభించారు. జిల్లాలో మూడు విడతల్లో భూ రీసర్వే జరిగింది. తొలి విడతలో 132 రెవెన్యూ గ్రామాల్లో, 80405.12 ఎకరాల భూమిని రీసర్వే చేసి 38,812 మంది రైతులకు జగన్ ఫొటోలతో ఉన్న పట్టాదారు పుస్తకాలను అందించారు. రెండో విడతలో 91 గ్రామాల్లోని 117117.64 ఎకరాలను రీసర్వే చేసి 44,991 పుస్తకాల్ని పంపిణీ చేశారు. మూడో విడతలో 329 గ్రామాల్లోని 104100.79 ఎకరాలను రీసర్వే చేసి 6484 మందికి పాసు పుస్తకాల్ని అందించారు. ఇలా మూడు విడతల్లో 329 గ్రామాల్లో 90,287 పుస్తకాల్ని పంపిణీ చేశారు.

వివాదాలు.. ఆందోళనలు

భూ రీసర్వేలో లోపాల కారణంగా రైతులు, భూ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. కొన్నిచోట్ల భూ యజమానులకు సమాచారం ఇవ్వకుండా, మరికొన్నిచోట్ల క్షేత్రస్థాయికి సర్వేయర్లు వెళ్లకుండా హద్దులు నిర్ణయించేసి ఆన్‌లైన్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. రీసర్వే తర్వాత భూ విస్తీర్ణంలో తేడాలు, భూ హక్కు పత్రాల్లో తప్పులు దొర్లడంతో కొందరు ఆయా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. సర్వేలో తమ భూమి తగ్గిపోయిందంటూ అనేక మంది గత ప్రభుత్వంలో నిర్వహించిన స్పందన కార్యక్రమాల్లోనూ ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సెంటు నుంచి 50 సెంట్ల వరకు భూమి తగ్గడంపై పక్క పొలం దారుడితో సరిహద్దు వివాదాలపై కొందరు ఫిర్యాదులు చేశారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో కొంతమంది రైతులకు 1బీ, అడంగల్ ఆన్‌లైన్‌లో రావడం లేదని, బ్యాంకు రుణాలకు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.

జగన్ ఫొటోలపై విమర్శలు

భూహక్కు పత్రంపై జగన్ ఫొటో పెద్దదిగా ఉండడంపైనా రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో చంద్రబాబు అనేక ప్రచార సభల్లో జగన్ ఫొటో ఉన్న పాసుపుస్తకాల్ని రద్దు చేసి రాజముద్రతో మళ్లీ కొత్త పుస్తకాల్ని పంపిణీ చేస్తానని మాటిచ్చారు. పుంగనూరు రోడ్‌షోలో జగన్ ఫొటోతో ఉన్న పాసుపుస్తకాన్ని చించి పడేశారు. మాట ఇచ్చిన ప్రకారం.. రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల జారీకి కసరత్తు చేపట్టారు. నమూనా పుస్తకాన్ని సోమవారం మీడియాకు చూపారు. జిల్లాలోనూ కొత్తవాటిని పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించారు.కాగా, రాజముద్రతో పాసుపుస్తకంతో పాటు సర్వే లోపాలు, సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



జగన్ ఫొటోతో ఉన్న పాత పాసుపుస్తకం

రీసర్వే జరగాక ఈ రైతు కష్టం చూడండి

జీడీనెల్లూరు మండలం కోటాగరం గ్రామానికి చెందిన రైతు దంపతులు ధనలక్ష్మి, లక్ష్మీపతిరెడ్డికి 2.15 ఎకరాల పొలముంది. ప్రస్తుతం మామిడి సాగు చేస్తున్నారు. రీసర్వే చేశాక ఐదు సెంట్ల భూమి తగ్గించి 2.10 ఎకరాలకే పట్టాదారు పాసుపుస్తకం జారీ చేశారు. ఈ 5 సెంట్ల భూమి నమోదు చేయాలని గ్రామ, మండల స్థాయి రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇలా వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో అనేక తప్పులున్నాయి.

తండ్రే కడతేర్చాడు!

- చార్జింగ్ వైరుతో కుమార్తె మెడకు బిగించి హతమార్చిన కసాయి



మృతి చెందిన గౌతమి

రొంపిచెర్ల, జూలై 29: రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలో 9వ తరగతి చదివే గౌతమిని ఆమె తండ్రే కడతేర్చాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రొంపిచెర్ల ఇన్‌చార్జి అయిన కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. నడింపల్లెకు చెందిన కె.గౌతమి పెద్దమల్లెల జడ్పీఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. 16 నెలల క్రితం తల్లి మరణించింది. అవ్వ ఆదరణలో ఉండగా.. ఆమె కూడా ఆరు నెలల కిందట మృతి చెందింది. అనంతరం తండ్రి మునిరత్నం గౌతమిని పోషించేవాడు. తండ్రీ కూతుళ్ల మధ్య తరచూ చిన్న చిన్న గొడవలు వచ్చేవి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆమె గొంతుకు సెల్‌ఫోను చార్జింగ్ వైరుతో బిగించడంతో ఆమె మృతిచెందింది. దీనిపై గౌతమి మేనమామ జయరాం సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎంఈవో-2 శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాగా చదివే విద్యార్థినిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు (సెంట్రల్), జూలై 29: జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, సాంఘిక సంక్షేమ, ఎయిడెడ్, మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న టీచర్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో దేవరాజు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అవార్డులకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులకు కనీసం 15 సంవత్సరాలు బోధనానుభవం ఉండాలన్నారు. గతంలో జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు తీసుకున్నవారు అర్హులన్నారు. దరఖాస్తుచేసేవారిపై శాఖపరమైన, క్రిమినల్ కేసులు ఉండరాదన్నారు. జాతీయ స్థాయి అవార్డుకు దరఖాస్తు చేసిన వారు రాష్ట్ర స్థాయి అవార్డుకు దరఖాస్తు చేయరాదన్నారు. దరఖాస్తులను ఆగస్టు 5లోపు ఎంఈవోకు, ఆపై డీవైఈవో ద్వారా ఆగస్టు 10లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేర్చాలని సూచించారు.

కుప్పం రెస్కోలో ఎస్పీడీసీఎల్ తనిఖీలు

కుప్పం, జూలై 29: కుప్పం రెస్కోలో విచారణ ప్రక్రియ కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతి చర్యలపై ప్రభుత్వం ఇప్పటికే సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని విచారణాధికారిగా నియమించడం, ఆమె ఇటీవల వచ్చి ప్రాథమిక విచారణ జరిపి, రికార్డులు పరిశీలించి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం ఎస్పీడీసీఎల్ డీఈ శంకర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం రెస్కో ప్రధాన కార్యాలయానికి చేరుకుని తనిఖీలు చేసింది. రెస్కో నిర్వహణకు సంబంధించిన టెండర్లు, కొనుగోళ్లు, విద్యుత్తు సామర్థ్యం, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు సరఫరా, వినియోగం ఇలా అన్ని అంశాలపై ఉద్యోగులను విచారించింది. సంబంధిత రికార్డులను పరిశీలించింది. ఈ ప్రొక్యూర్‌మెంట్ సంబంధిత అంశాలను విచారించి, వివరాలు నమోదు చేసింది. విచారణాధికారి శ్రీలక్ష్మి మరో వారం పదిరోజుల్లో రెస్కోకు వచ్చి తదుపరి విచారణ కొనసాగించే అవకాశం ఉంది.



గుడివంకలో కొండపై పోటెత్తిన భక్తులు



నోటికి ఇనుప చూలం గుచ్చుకుని..





వీపునకు ఇనుప చువ్వలు గుచ్చుకుని క్రేన్ సాయంతో వేలాడుతున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

గుడివంక.. జనవంక

'వేల్ మురుగునికి హరోం హర' నామస్మరణతో గుడివంక మార్మోగింది. ఆడికృత్తిక సందర్భంగా సోమవారం వేపమాను కొండపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామి మాలలు వేసుకొని దీక్షబూని భక్తులు కావళ్లు, తేరు కావళ్లు, నోటికి ఇనుప చూలాలు గుచ్చుకొని, శరీరం మొత్తం నిమ్మకాయలను గుచ్చుకొని, రాతి గుండును తాళ్లతో ఇనుప కొక్కీలను వీపునకు గుచ్చుకొని లాగుతూ, తేరు ఇనుప చువ్వలు గుచ్చుకొని, క్రేన్‌కు కొక్కీలతో వేలాడుతూ.. ఇలా వివిధ రూపాల్లో భక్తులు తమ గ్రామాల నుంచి డప్పువాయిద్యాలతో చేరుకున్నారు. కొండ కింద ఉన్న కోనేరులో స్నానం చేసి గంగ పూజ చేశారు. భజనలు చేస్తూ సుబ్రహ్మణ్యుడి కొండెక్కి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుప్పం పరిసర ప్రాంతాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచీ వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు దేవేరుల సహా సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పూలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఆలయ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీవారు భక్తులకు అన్నదానం చేశారు.

- గుడుపల్లె



తేరును ఇనుప చువ్వలతో వీపునకు గుచ్చుకొని వస్తున్న భక్తుడు

తొలిరోజు రూ.4 కోట్లు

- 224 మంది డాయ్ యాప్ బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ
- నేడూ వినతులు తీసుకోనున్న అధికారులు



మున్సిపల్ కార్యాలయంలో డాయ్‌యాప్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

పలమనేరు, జూలై 29: 'డాయ్ యాప్' బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. తాము రూ.లక్షల్లో నష్టపోయామని లబోదిబోమంటున్నారు. ఈ ఘటన నేపథ్యంలో బాధితుల నుంచి వివరాలు సేకరించేందుకు పోలీసు, మెప్మాపీడీ, రెవెన్యూ అధికారులతో కలెక్టరు సుమిత్‌కుమార్ బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు రెండు రోజుల పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకోనున్నారు. తొలిరోజైన సోమవారం డాయ్‌యాప్‌లో రూ.4.08 కోట్ల మేర మోసపోయినట్లు 224 మంది బాధితులు ఫిర్యాదు చేశారని అధికారులు తెలిపారు. ఉదయం నుంచీ భారీగా వస్తున్న ఫిర్యాదులను చూసి అధికారులు నివ్వెరపోయారు. ఏయే తేదీల్లో తమ సెల్‌ఫోన్ల నుంచి డబ్బులు పంపిందీ.. ఆ వివరాలను ప్రింటవుట్లు తీసుకొని అర్జీలు రాసి అధికారుల బృందానికి బాధితులు అందజేశారు. సోమవారం పలమనేరు సీఐ చంద్రశేఖర్, మెప్మా పీడీ రాధమ్మ, పలమనేరు రెవెన్యూ శాఖ నుంచి డీటీ జయలక్ష్మి ఫిర్యాదులు స్వీకరించారు. ఇక, మంగళవారం ఎంత మంది.. ఎన్ని రూ.కోట్లు మోసపోయామోనని వస్తారోనని అధికారులు అంటున్నారు.

ఆశపడి మోసపోయా



నేను డాయ్‌యాప్‌లో రూ.45వేలు పెట్టుబడి పెట్టా. ఆశ పడి డాయ్ యాప్ ఉచ్చులో పడి మోసపోయాను. ఎలా డబ్బులు చెల్లించాననే వివరాలతో అధికారులకు ఫిర్యాదు చేశా.

- నౌషాద్, పలమనేరు

అప్పుచేసి.. నిండా మునిగిపోయా



నేను అప్పుచేసి డాయ్‌యాప్‌లో రూ.77వేలు చెల్లించా. ఆ డబ్బు పోవడంతో నిండా మునిగిపోయా. దీనిపై అధికారుల బృందానికి ఫిర్యాదు చేశా.

- సయ్యద్ బాషా, పలమనేరు

స్నేహితులతో కలిసి రూ.కోటి కట్టా



నేను బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేస్తున్నా. మా ఇంటి పక్కనున్న మెప్మాలో పనిచేసే రాజేష్ బలవంతం చేసి డాయ్ యాప్‌లో డబ్బులు కట్టించాడు. నాతో పాటు బెంగళూరులోని మా మిత్రులంతా కలిసి రూ.కోటి మేరకు డాయ్‌యాప్‌లో చెల్లించాం. మేమంతా ఆర్‌టీజీఎస్ ద్వారా డబ్బులు చెల్లించాం.

- ఈశ్వర్, గడ్డూరు, పలమనేరు మున్సిపాలిటీ

రూ.10 లక్షలు చెల్లించాం



మా 17వ వార్డులోని మెప్మాలో పనిచేసే ఆర్పీ జరీనా ఒత్తిడి చేయడంతో నాతో పాటు బంధువుల ద్వారా కూడా రూ.10 లక్షలు డాయ్‌యాప్‌లో చెల్లించాం. కేవలం నెలరోజుల్లో రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశపెట్టి మా ద్వారా పెట్టుబడులు పెట్టించింది.

- నౌజియా, పలమనేరు పట్టణం

బాధితుల గోడు

మెప్మాపై తీవ్ర ప్రభావం!

డాయ్ యాప్ ఘటన మెప్మాపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇక్కడ మోసపోయిన వారిలో ఎక్కువ మంది స్వయం సహాయక సంఘాల సభ్యులే కావడం దీనికి కారణం. పలమనేరులోని మెప్మా సభ్యులు కొన్నేళ్లుగా బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొంటూ.. సకాలంలో చెల్లిస్తూ.. పొదుపు విషయంలోనూ మంచి పేరు తెచ్చుకొన్నారు. మెప్మాలో పనిచేసే ఆర్పీల ప్రోద్బలంతో వీరంతా డాయ్‌యాప్‌లో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి మోసపోయారు. వీరిలో కొందరు తమవద్దనున్న డబ్బులు పెడితే.. మరికొందరు అప్పులు చేశారు. ఇంకొందరు నగలను తాకట్టు పెట్టారు. ఇలా ఎవరికి తోచినట్లు వారు తమ స్థాయిని బట్టి రూ.వేలు నుంచి రూ.లక్షల్లో చెల్లించారు. ఇలా ఆర్థికంగా దెబ్బతిన్న సభ్యులు.. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించగలరా అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై బ్యాంకు.. మెప్మా అధికారులు సైతం ఆందోళన చెందుతున్నారు.

అర్జునా.. ఫల్గుణా

చిత్తూరు సమీపం మురకంబట్టులో మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవార ంఉదయం ఆదికేశవులు సర్కిల్‌లో తపస్మాన్ కార్యక్రమం నిర్వహించారు. తమ కోరికలు నెరవేరాలని భక్తులు తపస్మాను చుట్టూ వరపడ్డారు. తపస్మానుపై నుంచి అర్జున పాత్రధారి విసిరే నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు.

- చిత్తూరు కల్చరల్



తపస్మాన్‌పై నుంచి అర్జున పాత్రధారి విసిరే నిమ్మకాయల కోసం..



తపస్మాను చుట్టూ వరపడిన భక్తులు



చిత్తూరులోని చెంగల్రాయకొండ సుబ్రమణ్యేశ్వరాలయం వద్ద..

హరోం హర

ఆడికృత్తిక సందర్భంగా సోమవారం జిల్లాలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. పలువురు భక్తులు ఇళ్ల నుంచి కావళ్లతో వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటు చూసినా పసుపు దుస్తులు ధరించి.. కావళ్లు మోసుకెళుతున్న భక్తులే కనిపించారు.

- చిత్తూరు కల్చరల్



పుంగనూరులో పూలకావళ్లు తీసుకెళుతున్న భక్తులు

క్వారీపై లక్ష్మీపురంవాసుల దాడి

కుప్పం, జూలై 29: గుడుపల్లె మండలం గుత్తార్లపల్లె వద్ద ఉన్న ఆర్.ఆర్. గ్రానైట్స్ యాజమాన్యానికి చెందిన క్వారీపై కుప్పం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొందరు సోమవారం ఉదయం దాడిచేశారు. క్వారీలో పని చేస్తున్న కార్మికులను తరిమికొట్టి అక్కడి సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. అక్కడున్న గ్రానైట్ బండలను కంటైనర్లలో తరలించుకుని వెళ్లినట్లు క్వారీలోని కార్మికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి, గుంపును చెదరగొట్టి తరిమేశారు. దీనిపై కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్‌ను వివరణ కోరగా.. వడ్డెర సంఘానికి చెందిన వ్యక్తులు కొందరు క్వారీ దగ్గరకు వెళ్లి, స్థానికులైన తమకు పని ఎందుకు ఇవ్వలేదని అక్కడి ఉద్యోగులను నిలదీసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొంత ఘర్షణ జరిగిందన్నారు. ఇరువర్గాలతో మాట్లాడుతున్నామని తెలిపారు.

లింగనిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై నిఘా

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29: జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో చాలా వ్యత్యాసం ఉందని,ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. లింగనిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక, తమిళనాడులకు సరిహద్దులో జిల్లా ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు, డ్రగ్ కంట్రోల్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. లింగనిర్ధారణ, బాల్యవివాహాలపై క్షేత్రస్థాయిలో ఆశ, అంగన్వాడీ, ఏఎన్‌ఎంలు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి, టీబీ శాఖ అధికారి వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, ఐసీడీఎస్ పీడీ శైలజ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన, దిశ ఎస్‌ఐ నాగసౌజన్య, ఎన్జీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పరిశీలనకు రాజస్థాన్ బృందం

చిత్తూరు (సెంట్రల్), జూలై 29: ప్రకృతి వ్యవసాయం పరిశీలనకు రాజస్థాన్ బృందం సోమవారం జిల్లాను సందర్శించింది. అటల్ భుజల్ యోజన కింద ఏడుగురు వ్యవసాయ రాష్ట్ర స్థాయి అధికారులు,ఆరుగురు రైతులతో కూడిన బృందం బంగారుపాళ్యంతో పాటు పలు మండలాలో సాగుతీరను అధ్యయనం చేసింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఘన, ద్రవ జీవామృతం తయారీ, పెల్లటైజేషన్, విత్తన గుళికలు తయారీని పరిశీలించింది. వేరుశనగకు బదులుగా 18 రకాల పంటలను సాగు చేసే విధానాల గురించి తెలుసుకుంది. స్వయం సహాయక సంఘాల సహకారంలో కిచెన్ గార్డెన్, ప్రొడెక్షన్, సెల్లింగ్ విధానాలను చూసింది. ఏపీ స్టేట్ ఎస్ఆర్‌పీ సురేంద్రరెడ్డి, కల్పన, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్లలో ఉత్కంఠ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29: సార్వత్రిక ఎన్నికల విధుల నిర్వహణకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్లను తిరిగి వారి ప్రాంతాల్లో చేరేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం రిలీవ్ ఆర్డర్లు ఇచ్చారు. అనంతపురం, నంద్యాల, కడప, అన్నమయ్య, సత్యసాయి, కర్నూలు జిల్లాలకు 31 మంది తహసీల్దార్లు వెళ్లారు. వారిలో కర్నూలు జిల్లాకు వెళ్లిన ఎనిమిది మంది తప్ప మిగిలిన వారు ఆయా జిల్లాల నుంచి రిలీవ్ అయ్యారు. సోమవారం వారంతా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు రిపోర్టు చేస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వ నిబంధనల మేర మండలాల వారీగా పోస్టింగ్స్ మరో రెండ్రోజుల్లో ఇవ్వనున్నారు.

పీఎఫ్ సమస్య పరిష్కరించకుంటే పోరాటమే

జడ్పీ సీఈవోకు ముందస్తు నోటీసులిచ్చిన ఉద్యోగ సంఘ నేతలు



చిత్తూరు రూరల్, జూలై 29: జడ్పీ పరిధిలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం తప్పదని ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సీఈవో గ్లోరియాను కలిసి ముందస్తు నోటీసులు ఇచ్చారు. 2019 నుంచి ఇప్పటి వరకు జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో నెలవారీ చందా వివరాలను పూర్తి స్థాయిలో ప్రదర్శనలో ఉంచి అందుకు సంబంధించిన వడ్డీని జమ చేయాలని కోరామన్నారు. ఇటీవల మరణించిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు రమణ, సోమశేఖర్ నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, రహనా బేగంపాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

తిరుపతి (జీవకోన), జూలై 29: చౌడేపల్లె మండలానికి చెందిన జగదీష్‌కుమార్(32)పై దాడిచేసిన వైసీపీ యువతపై పోలీసులు చర్యలు తీసుకోవాలని హైకోర్టు లాయర్ చరణ్‌కుమార్ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో బాధితుడు జగదీష్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 25వ తేదీ రాత్రి 10గంటల సమయంలో జగదీష్‌కుమార్‌పై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారన్నారు. వైసీపీకి చెందిన కొంతమంది యువత ఆయన ఇంటి వద్ద వచ్చి ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎలా పనిచేస్తావంటూ రాడ్లు, రాళ్లతో దాడి చేశారని చెప్పారు. దీనికి సంబంధించిన ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. బాధితుడు మాట్లాడుతూ.. తాను ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నానని..ఇష్టానుసారం దాడి చేయడంతో కన్ను కోల్పోయి, జీవనోపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అధికారులు న్యాయంచేయాలని కోరారు. హేమలత,అమృత్, లీలాకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వరసిద్ధుడి పట్టువస్త్రాలు



పాకాల: ఆడికృత్తిక సందర్భంగా సోమవారం పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామికి కాణిపాకం వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ దంపతులు తీసుకొచ్చారు. స్వామివారికి సమర్పించి పూజలు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 113 అర్జీలు

చిత్తూరు, జూలై29: కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు వేర్వేరుగా జరిగాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టరేట్‌లో 113 మంది అర్జీదారులు హాజరై ఫిర్యాదులను అందించారు. రెవెన్యూశాఖకు 90, డీఎస్ఎల్‌వోకు 7, డీఆర్‌డీఏకు 2 వినతులతో పాటు మిగిలిన శాఖలకు ఒక్కో అర్జీ వంతున అందాయి. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ఇతరజిల్లా అధికారులు పాల్గొన్నారు.

రికార్డుల్లో నన్ను బతికించండి

మానసిక స్థితి సరిగాలేక 2019లో ఇంటి నుంచి వెళ్లిపోయాను. కడపలోని ఓ ఆశ్రమంలో చికిత్స చేయడంతో కోలుకున్నాను. 2020లో నాలాంటి పోలికలతో ఉన్న ఓ వ్యక్తి మరణించగా తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించేశారు. డెత్‌సర్టిఫికెట్ కూడా తీసుకున్నారు. గతేడాది ఇంటికి వచ్చాను. నేను బతికి ఉన్నట్లు రికార్డులను సరిదిద్దాలని కోరుతున్నాను.

- ఆంజనేయులుశెట్టి, పైమాఘం, తవణంపల్లె మండలం

సర్వే చేసి భూమి అప్పగించాలి



నా భూమి వైసీపీ వారు ఆక్రమించుకున్నారు. దీనిపై ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. అయినా స్పందన లేదు. నాకు న్యాయం చేయాలి.

- నాగభూషణం, ముదిగోళం, ఐరాల మండలం

● ఇంటి స్థలాన్ని ఇప్పించండి

మా అమ్మ నుంచి నాకు ఇంటి స్థలం సంక్రమించింది. అందులో వైసీపీ నేతలు అక్రమంగా టెంట్‌హౌస్ నిర్మించారు. కోర్టు ద్వారా న్యాయం జరిగినా వైసీపీ నేతలు స్థలాన్ని ఖాళీ చేయడం లేదు.

- మునిరాజా, పెద్దమల్లెల,రొంపిచెర్ల మండలం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మాకు న్యాయం చేయండి



1997లో మాకు ప్రభుత్వం డీకేటీ భూములతో పాటు పట్టాదార్ పాసు పుస్తకాలను ఇచ్చింది. ఈ భూమిని ముష్టిపల్లె, ఎస్ఎస్‌కొండ, కోటికట్లవాండ్లవూరుకు చెందిన వారు ఆక్రమించుకున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలను కూడా లాక్కున్నారు. అధికారులు విచారించి న్యాయం చేయాలి.

- బాధిత యానాదులు, దాసరాపల్లె, జీడీ నెల్లూరు మండలం

పోలీసుశాఖకు 31 ఫిర్యాదులు

పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 31 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ఈ ఫిర్యాదుల్లో భూ తగాదాల కింద 8, ఆస్తి తగాదాలు 7, ఇంటి తగాదాలు 4, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 2, చీటింగ్ కింద 2 చొప్పున ఉన్నాయి. అధికారుల దృష్టికి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సత్వరం పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ సూచించారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.



చల్లారని సీజేఎఫ్‌ఎస్ భూముల రగడ

జగన్ బొమ్మతో పాసుపుస్తకాల పంపిణీకి రెవెన్యూ అధికారుల చర్యలు ● అభ్యంతరంతో వెనక్కి



పంపిణీకి తీసుకెళ్లిన పట్టాలు

వెదురుకుప్పం, జూలై 29: వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె సమీపంలోని సీజేఎఫ్ఎస్ భూముల రగడ చల్లారలేదు. ఈ భూముల్లో వైసీపీ సహా స్థానికేతరులకు పట్టాలిస్తున్నారని స్థానికులు, టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గత సీఎం జగన్ బొమ్మతో ఉన్న సీజేఎఫ్ఎస్ భూముల పట్టా, పాసుపుస్తకాలను ఇవ్వడానికి సోమవారం రెవెన్యూ అధికారులు వెళ్లారు. జగన్ బొమ్మ ఉన్న పాసుపుస్తకాలను ఎలా పంపిణీ చేస్తారని, ఎమ్మెల్యే థామస్‌కి తెలియకుండా ఎలా పంపిణీ జరుగుతుందంటూ టీడీపీ నేత చొక్కా మహేష్ నిలదీశారు. అర్హులందరికీ పట్టాలివ్వాలని పదేపదే కోరినా పట్టించుకోని అధికారులు.. సోమవారం ఇవ్వడానికి ప్రయత్నించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ఆయన ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, రెవెన్యూ వారితో ఎమ్మెల్యే మాట్లాడారని, దీంతో పంపిణీ చేయకుండా అధికారులు వెళ్లారన్నారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే తమకు హామీ ఇచ్చారని మహేష్ చెప్పారు. దేవరగుడిపల్లె సీజేఎఫ్ఎస్ భూముల వ్యవహారంపై విచారణ జరిపించి, అర్హులకు న్యాయం చేయాలని నేతలు చంద్రబాబునాయుడు,రాజాజీ, అల్లిబాబు విజ్ఞప్తి చేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

దేవరగుడిపల్లె సీజేఎఫ్ఎస్ భూములకు సంబంధించి ఎన్నికల ముందుగా ఈ పట్టాలు సిద్ధం చేసినవి. ఆ భూముల్లో వారు తమకు పట్టాలు అందలేదని గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇవ్వడానికి వెళ్లాం. ఆ పాసుపుస్తకాలపై మాజీ సీఎం జగన్ ఫొటో ఉండటంతో అభ్యంతరం రాగా, పంపిణీ ఆపేశాం. సీజేఎఫ్ఎస్ భూముల్లోని అర్హులందరికీ న్యాయం చేశాం. నాన్ సీజేఎఫ్ఎస్ భూముల్లో వారికి పట్టాలు ఇవ్వాలంటే ప్రభుత్వ పాలసీ రావాలి.

-జయంత్‌కుమార్, తహసీల్దార్,వెదురుకుప్పం

లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్

- మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీస్‌లో ఫైళ్ల కాల్చివేత కేసు ఎఫెక్ట్
- గతంలోనూ క్రమశిక్షణా చర్యలు
- పెద్దిరెడ్డికి సన్నిహితుడిగా ముద్ర



తిరుపతి(కలెక్టరేట్), జూలై 29: తిరుపతి జిల్లా లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీని సస్పెండ్ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత కేసులో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ఆర్డీవోలు సహా ఒక సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.వీరిలో మదనపల్లి ఆర్డీవోగా పనిచేస్తూ తిరుపతికి ఫిబ్రవరి మాసంలో బదిలీపై వచ్చిన మురళి ఒకరు. సుమారు పది రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను కొంతమంది దగ్ధం చేసిన విషయం తెలిసిందే. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో భారీఎత్తున ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం... అనేక అవకతవకలు జరిగినట్లు గుర్తించడం.వీటిలో మురళీకి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ వేటు పడింది. మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మురళి అత్యంత సన్నిహితుడు.ఒంగోలులో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో మదనపల్లెలో పని చేస్తుండగా సస్పెండ్ చేయడంతో పాటు తహసీల్దారుగా రివర్షన్ సైతం ఇచ్చారు.పెద్దిరెడ్డి జోక్యంతో సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు రివర్షన్ కూడా ఉపసంహరించుకున్నారు. ఆరు నెలల క్రితం మురళి తిరుపతికి లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు.

రేపు జేఎమ్సీయెన్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కుప్పం, జూలై 29: కుప్పంలోని డాక్టర్ జేఎమ్సీయన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సులకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ ఉమ్మడి జిల్లాల పాలిసెట్ కన్వీనర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష రాసి, అర్హత పొందినవారు, పొందనివారు, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. పాలిసెట్ 2024 హాల్ టికెట్టు, ర్యాంక్ కార్డు, పదో తరగతి మార్కుల సర్టిఫికెట్, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకు రావాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.7వేలు (పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత పొందినవారికి), రూ.1,100 (పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించని వారికి) ప్రాసెసింగ్ ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు తప్పక తీసుకు రావాలన్నారు. సీటు పొందినవారు రూ.4,700 కళాశాల ఫీజు వెంటనే చెల్లించాలని చెప్పారు. తమ కళాశాలలో డిప్లొమో ఇన్ మెకానికల్, డిప్లమో ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, డిప్లొమో ఉన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూని కేషన్ ఇంజినీరింగ్, డిప్లొమో ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయన్నారు. స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందినవారికి ఉపకారవేతనం రాదని తెలియజేశారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. లేదా 99890641000, 9912342101 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముఖం చాటేసిన చినుకు

అధికవేడితో అల్లాడుతున్న జిల్లా ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29: రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలు భారీ వర్షాలతో అతలాకుతలం అవుతుంటే జిల్లాలో వర్షపు చుక్క కరువైంది. వేసవి తాపంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈనెలారంభం నుంచి అంతో ఇంతో తేలికపాటి వాన కురుస్తూ వచ్చినా 13వ తేదీ నుంచి వరుణుడు మాయమయ్యాడు. అడపాదడపా చినుకులు కురుస్తున్నా రైతాంగానికి ఉపయోగపడడం లేదు. జూన్ జిల్లా సాధారణ వర్షపాతం 80.8 మిమీ. అంతకు మించి 188.9 మిమీ వర్షం కురిసింది. ప్రజలు, కర్షకులు ఆనందపడ్డారు. ఈనెల సాధారణ వర్షపాతం 103.9 మిమీ. ఇప్పటివరకూ సాధారణానికంటే తక్కువగా 85.1 మిమీ మాత్రమే కురిసింది. గాలిలో తేమ శాతం తగ్గి పగలు, రాత్రి వేడిగాలులు వీస్తున్నాయి. భరించలేని వేసవి తాపం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం 9 గంటల నుంచే 36 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదవుతోంది. సాయంత్రం 5 గంటలకు కూడా వేడిమి తగ్గడంలేదరు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందిపడుతున్నారు. ఇదే పరిస్థితి మరో వారం పాటు ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. మధ్యాహ్న వేళలో బయటికి రావడానికి జనం జంకుతున్నారు. బలమైన వర్షాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నీలం మామిడి టన్ను రూ.1.14 లక్షలు

బంగారుపాళ్యం,జూలై29:స్థానిక మార్కెట్ యార్డులో మేలైన నీలం రకం మామిడి టన్ను రూ.1.14 లక్షలు, నాణ్యమైన తోతాపురి రకం టన్ను రూ.95వేలు ధర పలికింది. సోమవారం 18వ నెంబరు మండీకి పెద్దపంజాణి మండలం పొట్టగానిపల్లెకి చెందిన రైతు క్రిష్ణ నీలం రకం మామిడి తీసుకురాగా చెన్నైకి చెందిన వెంకటేష్ ముత్తు రూ.1.14 లక్షలకు వేలం ద్వారా కొనుగోలు చేశారు. పలమనేరుకు చెందిన ఫిరోజ్ తీసుకొచ్చిన మేలైన తోతాపురి మామిడిని బెంగుళూరుకు చెందిన శ్రీనాథ్ టన్ను రూ.95వేలకు దక్కించుకున్నారు. ఐదు రోజుల్లో సీజన్ ముగియనున్నట్లు యజమానులు తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 42 వినతులు


ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కడా పీడీ

కుప్పం, జూలై 29: కుప్పం మండల సచివాలయంలో సోమ వారం కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటదాకా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి పీడీకి మొత్తం 42 వినతులు అందాయి. ఇందులో పది అర్జీలు రెవెన్యూ సమస్యలపైనా, మిగిలి అర్జీలు వివిధ మౌలిక సదుపాయాలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు చొరవచూపాలని అన్నారు. గడువు నిర్దేశించుకుని పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోతో పాటు వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్రబడ్జెట్ పత్రాలను తగులబెట్టిన కేవీపీఎస్



పలమనేరు, జూలై29 : పలమనేరులో సోమ వారం కేవీపీఎస్ నాయకులు కేంద్ర బడ్జెట్ పత్రాలను తగులబెట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ జిల్లా నాయకులు ఓబుల్‌రాజు, ఈశ్వర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కేవలం పెట్టుబడి దారులకు ప్రయోజనం కలిగించేదిగా ఉందన్నారు. ఉపాధి హామీ పథకానికి పెండింగ్‌లో ఉన్న రూ.330 కోట్ల బిల్లులు ఇవ్వకపోగా బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, వ్యవసాయ రంగానికి, మొండి చెయ్యి చూపిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజ చట్టంలోని హామీలు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసినప్పటికి అధికార పార్టీ కూటమి నేతలు నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు సుబ్రమణ్యం, రామ్మూర్తిఆచారి, వెంకటముని, చంద్రశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



రామకుప్పం, జూలై 29: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ గెర్నిపల్లెకు చెందిన మురళి సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ సీనియర్ నేత సుధాకర్‌రెడ్డి, బూత్ కన్వీనర్ సలాం, నేతలు హైదర్, రఫీ, హరీష్, వెంకటేశ్, కృష్ణ కాంత్ తదితరులు మురళి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

అయ్యప్పగానిపల్లె పాఠశాలలో శిక్షా సప్తాహ్



శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో టీడీపీ నేతలు, ఉపాధ్యాయులు

రామకుప్పం, జూలై 29: మండలంలోని అయ్యప్పగానిపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమం జరిగింది. స్థానిక టీడీపీ నాయకులు విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఐ-టీడీపీ మండల అధ్యక్షుడు సురేష్, మాజీ వార్డు సభ్యుడు శంకరప్ప, ఎస్ఎంసీ చైర్మన్ భాగ్యమ్మ, నేతలు సురేష్‌కుమార్, వెంకటరామప్ప, మురుగేష్, మణి, వెంకటేశ్, స్వప్న, రోజా, హెచ్ఎం సౌదామిని, ఉపాధ్యాయుడు ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు కాపాడండి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై29: పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు దురాక్రమణకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో వారు మాట్లాడారు. పట్టణంలోని చౌడేపల్లె మార్గంలోని రాయలచెరువు కాల్వ నీరు ప్రవహించే కాల్వను కొంతమంది ఆక్రమించి విక్రయాలు చేస్తూ కోట్ల రూపాయాలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

మురుగన్ ఆలయాలకు పోటెత్తిన భక్తజనం


సుబ్రమణ్యస్వామి

వి.కోట, జూలై 29: ఆడికృత్తిక వేడుకలు మండలంలో అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాలు వేల్‌మురుగన్ నామస్మరణతో మార్మోగాయి. నాయకనేరి అడవిలోని పెద్దనాయక దుర్గంలో వెలసిన సుబ్రమణ్యస్వామిని దర్శించుకునేందుకు ఉదయం నుండి పెద్ద ఎత్తున భక్తులు కావళ్లతో తరలివచ్చారు. అలాగే యాదగిరి కొండ, సీవీఆర్ కొండపైన స్వామివారికి అభిషేకాలతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంత మంది భక్తులు భరణి కావడిని చెల్లించారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సీవీఆర్ కొండపై స్వామి వారిని దర్శించుకున్నారు. అన్ని ఆలయాలు భక్త జనంతో కిక్కిరిశాయి. ఆలయ కమిటీవారు భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించి దర్శన భాగ్యం కల్పించారు.

సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అమర్



పలమనేరు, జూలై 29: ఆడికృత్తిక సందర్భంగా పలమనేరు సమీపంలోని టీఎస్ అగ్రహారం వద్ద కొండపై వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు అమరనాథరెడ్డికి స్వాగతం పలికారు.

భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు

చౌడేపల్లె, జూలై29: భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. స్థానిక సంతగేటు వద్ద నివాసం ఉంటున్న బాబు భవన నిర్మాణ కార్మికుడు. ఆయన కుమార్తె గ్రేషాంజరి స్థానిక నాయునివారిపాళ్యంలో నివాసం ఉంటున్న వంశీకృష్ణను మే 12న పెద్దలకు తెలియకుండా ప్రేమ వివాహం చేసుకుంది. తర్వాత వీరు బెంగళూరుకు వెళ్లి అక్కడ పనులు చేసుకుంటున్నారు. వంశీకృష్ణ, అతని తల్లిదండ్రులు, మిత్రులు కలసి మతం మార్చుకోవాలని ఒత్తిడితెచ్చారు. మతం మారకుంటే ఇల్లు విడిచి వెళ్లిపోవాలని, వరకట్నం తీసుకురాలేదని వేధించేవారు. దీంతో ఆమె తల్లిదండ్రులు బాబు, జ్యోతిలు తమ కూతురుకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

సుబ్రమణ్యస్వామికి విశేషపూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బైరెడ్డిపల్లె, జూలై 29 : మండలంలోని నెల్లిపట్ల దేవర కొండపై వెలసిన సుబ్ర మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి అభిషేకంచేసి ప్రత్యేకపూజలు జరిపారు. భక్తులు ఆలయం వద్ద కావళ్లు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. వేల్‌మురుగన్‌కు హరోంహర అంటూ భక్తుల నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోల పంపిణీ



గంగవరం, జూలై 29: గంగవరం పంచాయతీ కార్యాలయానికి గంగవరం మండల టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఫొటోలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌నాయుడు, ఆనంద్, మురళి, చిట్టిబాబు, యుగంధర్, గిరి, రవి, రెడ్డెప్ప, రామాంజులు, రఘు తదితరులు పాల్గొన్నారు.

600 మందికి చికిత్సలు



గుడుపల్లె, జులై 29: కుప్పం బీఆర్‌డీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారిచే గుడివంక కొండపై కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 600 మంది భక్తులు చికిత్సలు పొందారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ హరిప్రసాద్, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీలారీ ఢీకొని వృద్ధుడి మృతి

గంగవరం జూలై 29: స్థానిక మండల కేంద్రంలోని సాయి శ్రీనివాసనగర్ సమీపంలో మినీలారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మబ్బువాళ్లపేట గ్రామానికి చెందిన వెంకటేష్ (64) కుండలు తయారుచేసి జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో పనిచేయడానికి సాయి శ్రీనివాస నగర్ వద్ద రోడ్డుపై నడిచివెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వస్తున్న మినీలారీ ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన ఆయన్ను స్థానికులు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గంగవరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి


పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

పుంగనూరు రూరల్, జూలై29: పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి సహకరించాలని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ కోరారు. సోమవారం స్థానిక కళాశాల ఆవరణలో పూర్వపు విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని కోరారు. అనంతరం పండ్ల మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శైలేంద్ర, విజయ శంకర్, పలమనేరు ప్రభుత్వ కాలేజీ అధ్యాపకుడు నందీశ్వరయ్య, విజయకుమారి, గిరిధర్, యుగంధర్ పాల్గొన్నారు.

మంత్రి సవితమ్మను కలసిన పుంగనూరు టీడీపీనేతలు



పుంగనూరు, జూలై29: మంత్రి సవితమ్మను పుంగనూరు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం పెనుకొండలోని మంత్రి కార్యాలయంలో కలిసి బీసీల అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం అందిం చాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుమార్, సయ్యద్‌అలీ, అమరనాథ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన బంగారు తిరుత్తణి

- భారీగా పుష్పకావళ్లు సమర్పించిన భక్తులు
- మార్మోగిన హరోంహర నామం


సోమల పట్టణ వీధుల్లో పుష్పకావళ్ల ఊరేగింపు

సోమల, జూలై 29: సోమల బంగారు తిరుత్తణి కొండ హరోం హర నామసర్మణలతో మార్మోగింది. కొండపై కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా సోమవారం పుష్ప కావిళ్లతో భక్తులు తరలివచ్చారు. అంతకుముందు హరోం హర నామ స్మరణలతో సోమల వీధుల్లో ఊరేగారు. ఇంటింటా మహిళలు పుష్పకావళ్లకు పూజలు చేశారు. స్వయంభేశ్వరస్వామి ఆలయం, సాయిబాబా ఆలయం, వినాయకస్వామి ఆలయాల్లో పురోహితులు స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పుష్పకావిళ్లకు పూజలు జరిపారు. పుష్ప కావళ్లతో భక్తులు బంగారు తిరుత్తణి ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లేశ్వరపురంలోని మల్లేశ్వర ఆలయంలో పలువురు భక్తులు పుష్ప కావిళ్లకు పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. బంగారు తిరుత్తణి ఆలయం వద్ద భక్తుల జాగరణకోసం టీటీడీ విశ్వహిందూ పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల హరికథలు, చెక్కభజనలు, కోలాటాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను నిర్వాహకులు మేల్నాటి రఘుపతి, సుబ్రహ్మణ్యం, పూల మురళీకృష్ణ, శ్రీదేవి, రెడ్డి జనార్ధన్, వేణుగోపాల్ పర్యవేక్షించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పిల్లలకు నాణ్యమైన ఆహారం, విద్య అందించాలి


అంగన్వాడీలతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జూలై26: అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు నాణ్యమైన ఆహారంతో విద్య అందించాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పులిచెర్ల మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు చల్లాబాబుకు పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, వేతనం రూ.26వేలుకి పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చేందుకు సహకరించాలని కోరారు. అనంతరం అదే మండలానికి చెందిన రైతులు చల్లాబాబును కలిసి ఏనుగుల దాడులతో పంటలు నష్టపోయామని నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. దీంతో చల్లాబాబు అటవీరేంజ్ అధికారితో మాట్లాడారు. ఏనుగులు పొలాలపై పడకుండా చర్యలు తీసుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సి.నారాయణ రెడ్డికి ఘన నివాళి



గంగవరం, జూలై 29: జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని స్థానిక కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆయన జయంతిని పురస్కరించుకొని కళా మందిరంలో నారాయణరెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాధం నాయుడు మాట్లాడుతూ అనేక రచనలు, సినిమా పాటలు, గజల్స్ ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వ్యక్తి సి.నారాయణ రెడ్డి అని కొనియాడారు. కేంద్ర సాహిత్య పురస్కారం, పద్మశ్రీ, పద్మభూషణ్ లాంటి పురస్కారాలు అందుకొన్న మహనీయుడన్నారు. తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతిగా తెలుగు భాషకు ఎనలేని సేవలు అందించారని కీర్తించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, మాధవరెడ్డి, ధనంజయ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా యల్లమ్మ తల్లి ఊరేగింపు


దీక్ష విరమిస్తున్న సిద్ధులు

సోమల, జూలై 29: మండలంలోని కరకమందలో యల్లమ్మ దేవత జాతర సందర్భంగా అమ్మవారి జలదివాస, మరుపల్లెం పూజా కార్యక్రమంతో జాతర ముగిసింది. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం ఉదమం 5గంటల వరకు అమ్మవారిని గ్రామ వీధులల్లో బాణ సంచావేడుకలతో, డీజేలతో యువకులు కోలాహలంగా ఊరేగించారు. ఈ క్రమంలో అమ్మవారి ఆయుధాలకు జలాభిషేకం నిర్వహించారు. జాతర నిర్వహణకు ఉభయదారులుగా వ్యవహ రించిన ఎం.మునిరాజ, వంశీప్రియ దంపతులను గ్రామస్తులు సన్మానించారు. 2025 ఏడాదిలో జాతర నిర్వహణ ఉభయ దారులుగా వ్యవహరించడానికి పలువురు పోటీలు పడ్డారు. ఈ క్రమంలోనే నారాయణకు గ్రామస్తులు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచు వెంకటరమణ, డాక్టర్ శివమూర్తి, వాసుదేవకుమార్, వి.కృష్ణమూర్తి, అమరనాథ్, పి.మురళి, హరి, జయప్రకాశ్, గిరి, శ్యాంసుందర్ బాబు, చంద్ర, కరకమంద యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే డెంగ్యూ నిర్మూలన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జానకీరావు

కల్లూరు, జూలై 29: దోమలను నివారించడంతోనే డెంగ్యూ నివారణ సాధ్యమ వుతుందని ప్రభుత్వ వైద్యాధికారి జానకీరావు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు, బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీల్లో సోమవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు. ముందుగా కల్లూరు బీసీ హాస్టల్‌ను డాక్టర్ జానకీరావు బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. మరుగుదొడ్లు, వంటగది తదితర వాటిని పరిశీలించి విద్యార్థులకు ఆరోగ్యసూత్రాలు తెలియజేశాచారు. బోడి రెడ్డిగారిపల్లి పంచాయతీ తోట వారిపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ నవీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుమిత్ర గ్రూపులను పటిష్టం చేయాలి


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూలై 29: గ్రామాల్లో రైతుమిత్ర గ్రూపులను పటిష్టం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, యూనిట్ ఇన్‌చార్జీ వెంకటరమణ తెలిపారు. సోమవారం రామకుప్పంలో వారు రైతుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమాన్ని పట్టించుకోక పోవడంతో రైతుమిత్ర సంఘాలు నిర్వీర్యమయ్యాయన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రైతుమిత్ర సంఘాలను పటిష్టం చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. రైతులు ముందుకు వచ్చి సంఘటితమై ప్రభుత్వం ద్వారా అందే అన్ని ప్రోత్సాహకాలను పొందాలని కోరారు.

ఘనంగా గంగమ్మ జాతర


పెద్దఉప్పరపల్లెలో ప్రతిష్ఠించిన గంగమ్మ

సోమల, జూలై 29: మండలంలోని పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, మేటి మండల్లో సోమవారం గంగ జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ నడి వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు బలిపోతులను బలిదానం చేశారు. మహిళలు బోనాలు, పిండిదీపాలను ఊరేగింపు తీసుకొచ్చి అమ్మవార్లకు సమర్పించారు. సాయంత్రం అమ్మవార్లును ఊరేగింపుగా తీసుకెళ్లి జలదిలో కలిపారు. విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు, సులోచన దంపతులు అమ్మవారికి సారె అందజేశారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మునిరెడ్డి

పుంగనూరు రూరల్, జూలై29: పింఛన్ల పంపిణీలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో మునిరెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1వ తేదీ పూర్తిస్థాయిలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందజేయాల్సి ఉందన్నారు. ఉదయాన్నే గ్రామాలకు చేరుకుని రెండు రోజుల్లో పంపిణీ పూర్తిచేయాల్సి ఉందన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



పుంగనూరు రూరల్, జూలై29: ప్రభుత్వం ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌లు, పుస్తకాలు అందజేస్తున్నట్లు బసవరాజ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ కమలాకర్ తెలిపారు. సోమవారం విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్ ఖాన్, కార్యదర్శి నారాయణస్వామి, మహ్మద్‌అలీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం


అర్జీలను స్వీకరిస్తున్న శివయ్య

పుంగనూరు రూరల్, జూలై29: ప్రజా పరిష్కార వేదిక రోజైన సోమవారం అందించే ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శివయ్య తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల గదికి ప్రత్యేక భద్రత కల్పించినట్లు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కాపలా ఉన్నట్లు తెలిపారు.

పుంగనూరు రోటరీక్లబ్ అధ్యక్షుడుగా హరిప్రసాద్


అధ్యక్షుడుగా హరిప్రసాద్

పుంగనూరు, జూలై29: పుంగనూరు రోటరీక్లబ్ నూతన అధ్యక్షుడుగా హరిప్రసాద్‌ను, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని రోటరీక్లబ్ సభ్యుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ పేదలకు సేవా కార్యక్రమాలు, మొక్కలు పెంచడం, వైద్యశిబిరాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ రాజారెడ్డి, అనిల్‌కుమార్, డాక్టర్లు ప్రభాకర్, శరన్‌కుమార్ రెడ్డి, పూలత్యాగరాజు, భాస్కర్‌జెట్టి, ఎస్వీటీ కిషోర్, మునిరాజా, అర్షదాలి, సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రాజు, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కావళ్ల చెల్లింపులు

పుంగనూరు రూరల్, జూలై29: కావళ్ల పండుగ సందర్భంగా సోమవారం పుంగనూరులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో కావళ్లు చెల్లించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. మంగళవారం కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా ఆడికృత్తిక వేడుకలు




విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి, పాలరేవుగడ్డలోని బాలమురుగన్ ఆలయం వద్ద భక్తజనం

రామకుప్పం, జూలై 29: మండలంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. రామకుప్పంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, పాలరేవుగడ్డలోని బాలమురుగన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునే మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. ఉదయం 9గంటల నుంచే భక్తులు దర్శనాలు చేసుకున్నారు. పలువురు భక్తులు కావళ్లు, నెమలి కావళ్లు, వీపుతేర్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. పాలరేవుగడ్డ బాలమురుగన్ ఆలయంలో ఆడికృత్తిక వేడుకలను టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మెన్ సీతాపతి, నేతలు జయశంకర్, గిరిదాసు, శ్రీనివాసులు, ఎర్రప్ప, మునిరత్నం తదితరులు పర్యవేక్షించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మృతుడి భార్యకు ఆర్థిక సాయం



చిత్తూరు, జూలై 29: అనారోగ్యంతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ భార్యకు సోమవారం ఎస్పీ మణికంఠ ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించారు. పాలసముద్రం పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ జయ ప్రకాష్ ఈ నెల 26న అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి భార్య రెడ్డి రాధకు తక్షణ సాయంగా ఐడీఆర్ఎఫ్ నుంచి రూ.లక్ష చెక్కును ఎస్పీ అందించారు. ఏఎస్పీ అరీఫుల్లా, పోలీసు సంఘం అధ్యక్షులు ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

గ్రామాల నుంచి తిరుత్తణికి తరలిన భక్తులు

విజయపురం, జూలై 29: ఆడికృత్తికను పురస్కరించుకొని సోమవారం తెల్లగుంట, జగన్నాథపురం, విజయపురం, పన్నూరు సబ్‌స్టేషన్, మాధవరం, పాతార్కాడు, ఎల్లసముద్రం, ఆలపాకం గ్రామాల భక్తులు కావిళ్లతో ఆలయాలకు బయలుదేరారు. కొందరు శూలం పొడుచుకొని తిరుత్తణి, రామగిరి సుబ్రహ్మణ్యం స్వామిని దర్శించి మొక్కు చెల్లించారు.

హెపటైటిస్ లేని సమాజ స్థాపనే లక్ష్యం : కలెక్టర్



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29: 2030 నాటికి హెపటైటిస్ లేని సమాజస్థాపనే లక్ష్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెపటైటిస్ వైరస్ కలుషిత రక్తం ద్వారా, శుభ్రత లేని ఆహారం, నీటి వల్ల ఇతరులకు సోకుతుందన్నారు.శిశువులకు హెపటైటిస్-బి వ్యాక్సిన్ ఇస్తున్నట్లు చెప్పారు. డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ రెడ్డి, డీఐవో హనుమంతరావు, సుదర్శన్, శిరీష పాల్గొన్నారు.

ఊరూ వాడా హరోంహర నామస్మరణ

నగరి జూలై29: ఆడికృత్తికను పురస్కరించుకుని కావళ్లు తీసుకెళ్లిన భక్తుల హరోంహర నామస్మరణతో పట్టణం, మండలం మార్మోగిపోయాయి. సోమవారం ఉదయం 10 గంటల నుంచి భక్తులు ఇంటి వద్ద పూజలు చేసుకుని కావళ్లను తీసుకుని హరోం హరా అంటూ తిరుత్తణి సుబ్రమణ్యస్వామి గుడికి వెళ్లారు. స్వామికి భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలు



శ్రీరంగరాజపురం, జూలై 29: రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ శివాజీ నాయుడు ద్విచక్ర వాహనంపై సోమవారం ఉదయం కొటార్లపల్లె వెళ్తుండగా మార్గ మధ్యలో 49 కొత్తపల్లెమిట్ట వద్ద కారు ఢీకొంది. దీంతో శివాజీ తీవ్రంగా గాయపడ్డారు. ఈయనను వేలూరు ఆస్పత్రికి తరలించారు. హెల్మెట్ ఉండడంతో ప్రాణాపాయం తప్పింది.

31న వాహనాల వేలం

గుడిపాల, జూలై 29: మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 31వ తేది ఉదయం 10 గంటలకు నరహరిపేట పోలీసు స్టేషన్‌లో వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ, గుడిపాల ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా పోలీసులను సంప్రదించాలని కోరారు.

వైభవంగా ఆడి అష్టమి పూజలు

నగరి జూలై29: కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలోని కాలభైరవస్వామి ఆలయంలో సోమవారం ఆడి అష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకం చేశారు. అభిషేకానంతరం స్వామి వారికి చందనాలంకరణ చేశారు. భక్తులు మొక్కుగా ఇచ్చిన వడమాలలతో స్వామివారిని అలంకరించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. **తవణంపల్లె:** అరగొండలో స్వయంభునేశ్వర కుమారస్వామి దేవస్థానంలో భరణి వేడుకలను ఆలయ ధర్మకర్త డాక్టర్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేక ఆరాధనలు నిర్వహించారు. అనంతరం కళ్యాణోత్సవం నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు ప్రసాద్ స్వామి, విభాకరశాస్త్రి, నిర్వాహకులు నరేష్‌కుమార్, రామకృష్ణారెడ్డి, రాజేశ్వరమ్మ, ధనంజయ పాల్గొన్నారు.

తొలిరోజే పింఛన్లు అందజేయాలి

తవణంపల్లె, జూలై 29: ఎన్టీఆర్ పింఛన్లు మొదటి రోజే నూరు శాతం పంపిణీ చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం తమ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఓడీఎఫ్ సర్వే పూర్తి చేయాలన్నారు.

మినీలారీ ఢీకొని వృద్ధుడి మృతి

గంగవరం జూలై 29: స్థానిక మండల కేంద్రంలోని సాయి శ్రీనివాసనగర్ సమీపంలో మినీలారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మబ్బువాళ్లపేట గ్రామానికి చెందిన వెంకటేష్ (64) కుండలు తయారుచేసి జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో పనిచేయ డానికి సాయి శ్రీనివాస నగర్ వద్ద రోడ్డుపై నడిచి వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వస్తున్న మినీ లారీ ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన ఆయన్ను స్థానికులు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గంగవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి ప్రపత్తులతో ఆడికృత్తిక ఉత్సవాలు




గిరింపేట ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి - స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్,తదితరులు

చిత్తూరు కల్చరల్, జూలై29: గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయంలో సోమవారం భక్తి ప్రపత్తులతో ఆడికృత్తిక పూజలు జరిగాయి. ఆలయ ఈవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ ఉభయదారులు పూల సుబ్రమణ్యంనాయుడు, డాక్టర్ ఎస్‌టీ రంగనాథ్ దంపతులు అభిషేకం, ప్రత్యేక పూజలు, విశేష అలంకారం చేశారు. అనంతరం వందలాది మంది భక్తులు కావళ్లు ప్రదర్శనగా తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. భక్తులకు తాగునీరు, తీర్థ ప్రసాదాలు పంపిణి చేశారు. బజారు వీధి శివ షణ్ముగ సుందర వినాయక ఆలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. ఆయనకు ఈవో తిమ్మారెడ్డి, ఆలయ కమిటి ఛైర్మన్ కన్నన్, డిప్యూటి మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు వసంత నాయుడు తదితరులు పాల్గొన్నారు. స్వామి వారిని ప్రత్యేక రథంలో ఊరేగించారు. సంతపేట గాండ్లవీధి, కట్టమంచి కులందేశ్వరాలయంలో పూజలు చేశారు. **గుడిపాల:** కందగిరికొండపై సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ స్వగ్రామమైన కోలావూరులో గురజాల జీవన్ తదితర కుటుంబ సభ్యులు కందగిరికొండలో కావళ్ళను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. చిత్తపార, అడవిచేనులో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, టీడీపీ నాయకులు జయదేవ్ నాయుడు, రవి నాయుడు, ఆనంద్ యాదవ్, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. **కార్వేటినగరం:** కొమరగిరిపై సుబ్రమణ్యేశ్వర స్వామికి వేలాది మంది భక్తులు కావడి మొక్కులను తీర్చుకున్నారు. స్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అన్నదానం చేశారు. సాయంత్రం వర్షం కారణంగా భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. స్థానిక స్కంద పుష్కరణిలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. **పూతలపట్టు:** తలుపులపల్లి సమీపాన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేశారు. **పాలసముద్రం:** మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు పుష్ప కావళ్లతో తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లారు.




నగరి నుంచి తిరుత్తణి కావిళ్లతో వెళ్తున్న భక్తులు - విజయపురం నుంచి శూలాలతో మొక్కులు చెల్లించేందుకు ఇలా..

కనుల పండువగా అర్జున తపస్‌మాను వేడుక




తపస్‌మాను చుట్టూ పోటీపడుతున్న భక్తులు- అర్జున పాత్రధారి

చిత్తూరు కల్చరల్, జూలై 29: స్థానిక మురకంబట్టులో మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం అర్జున తపస్‌మాను ఉత్సవం జనరంజకంగా నిర్వహించారు. ఆదికేశవులు నాయుడు సర్కిల్‌లో తొలి సారిగా తపస్‌మానును ఆవిష్కరించారు. భక్తులు తపస్‌మాను చుట్టూ వరపడ్డారు. వీరికి ఉత్సవ నిర్వాహకులు కొబ్బరికాయలు, పసుపు కుంకుమలు, అక్షింతలు, బొందుదారాలు పంపిణి చేశారు. అర్జున ప్రాత్రధారి తపస్‌మాను ఎక్కుతూ ఉత్సవ విశిష్టతను తెలియజేశారు. చివరి మెట్టుకు చేరి భక్తులపై ప్రసాదాలను చల్లగా వాటి భక్తులు ఎగబడ్డారు. అన్నదానం చేశారు. ప్రధాన ధర్మకర్త రెడ్డెప్ప, కార్తికేయన్, గోపి, మధు, మునివేలు, ప్రకాశం, రమేష్, బాలాజి, రంజిత్ పాల్గొన్నారు.

సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం : కమిషనర్



అర్జీదారుడితో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు, జూలై 29: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. 10 ఫిర్యాదులు అందాయి. వాటిలో మెప్మాకు 5, టౌన్‌ప్లానింగ్‌కు 2, ఇంజనీరింగ్‌కు 2, పబ్లిక్‌హెల్త్‌కు ఒకటి వంతున అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వార్డుల్లో పక్కాగా పారిశుధ్యం, నీటి సరఫరా

వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరా పక్కాగా చేపట్టాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె పలు వార్డుల్లో తనిఖీలు చేశారు. తిమ్మసముద్రం, దుర్గాకాలనీ, బాబా కాలనీ, చవటపల్లె రోడ్డులో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా క్లోరిన్ పరీక్షలను నిర్వహించాలని, లీకేజీలు లేకుండా చూడాలన్నారు. దుర్గా నగర్‌కాలనీ చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని ఆదేశించారు. ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, డీఈ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

చురుగ్గా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

కార్వేటినగరం, జూలై 29: నియోజకవర్గంలో ఐదువేల మందితో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ తెలపారు. సభ్యత్వ ప్రక్రియ వేగంగా సాగించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. చురుగ్గా సాగుతున్న నమోదు మరింత పెరిగితే పార్టీ పటిష్టమవుతుందన్నారు.

డైట్‌లో సహపంక్తి భోజనం



కార్వేటినగరం, జూలై 29: స్థానిక డైట్‌లో సోమవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సహపంక్తి భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యంతో ప్రమాదాలు : టీడీపీ

గుడిపాల, జూలై 29: రోడ్డు ప్రమాదాలెక్కువగా జరుగుతున్నా సంబంధిత హైవే అధికారులు పట్టించుకోకపోవడం లేదని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు-వేలూరు, బెంగుళూరు - చెన్నై రహదారిలో హైవే అధికారులు చేపడుతున్న పనుల్లో నిర్లక్ష్యం కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నెలరోజుల వ్యవధిలోనే ఏడుగురు మృతిచెందగా, మరో 20 మంది దాకా గాయాలపాలయ్యారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులను వేగవంతం చేయాలని కోరారు.

కొండ మల్లీశ్వరస్వామికి పాలాభిషేకం



వెదురుకుప్పం, జూలై 29: అరుణగిరి క్షేత్రంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఆలయ ఆవరణలో అన్నమయ్య, శివనామ సంకీర్తనలను ఆలపించారు. ఎగువ కన్నికాపురం సమీపంలోని స్వయంభు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం, రుద్రాభిషేకం, పూజలు చేశారు. తీర్థప్రసాదాలను అందించారు. చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు.

పాలసముద్రంలో లెప్రసీ పరీక్షలు



పాలసముద్రం, జూలై 29: స్థానిక కాలనీలో సోమవారం డాక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది లెప్రసీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు, ముఖం, చేతులు మీద తెల్లమచ్చలున్నా, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు ఉన్న అనుమానితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు రాణి, అన్నపూర్ణ, సరళ పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో

సర్వేతో కుష్ఠు వ్యాధి గుర్తింపు

వెదురుకుప్పం, జూలై 29: ఇంటింటా సర్వే ద్వారా కుష్ఠు వ్యాధి గుర్తించడం సాధ్యమని ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటప్రసాద్ అన్నారు. సోమవారం నల్లవెంగనపల్లె హెల్త్ క్లీనిక్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో 14 మంది అనుమానితులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఎంఎల్‌హెచ్‌పీ గజేంద్రను అభినందించారు. డీపీఎంవో జాన్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ కాణిక్‌రాజ్, ఎంఎల్‌హెచ్‌పీ గజేంద్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కాణిపాక ఆలయ మాజీ సీఎఫ్‌వో

చిత్తూరు రూరల్, జూలై 29: ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కాణిపాక ఆలయ మాజీ సీఎఫ్‌వో నాగేశ్వరరావు సోమవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన్ను సన్మానించి స్వామివారి ప్రసాదం అందజేశారు. టీడీపీ నాయకులు శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

